నక్కలదిన్నెలో నాకాబందీ

- పోలీస్,ఎస్ఈబీ అధికారుల సంయుక్త తనిఖీలు
- రికార్డులు లేని ఆరు ద్విచక్రవాహనాలు స్వాధీనం
- వ్యభిచార గృహ నిర్వహణపై స్థానికుల ఫిర్యాదు
- నిర్వాహకులపై కేసు నమోదు


నక్కలదిన్నె తండాలో స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ కేశప్ప, పోలీస్ అధికారులు

మదనపల్లె : పట్టణంలోని నక్కలదిన్నెలో పోలీస్, ఎస్ఈబీ అధికారులు జల్లెడపట్టారు. నాకాబందీలో భాగంగా శుక్రవారం ఉదయం 4 గంటల నుంచి 6.30 వరకు కాలనీలోని ఇంటింటికీ వెళ్లి తనిఖీలు నిర్వహించారు. పోలీస్ సోదాల్లో రికార్డులు లేని ఆరు ద్విచక్రవాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ కేశప్ప నేతృత్వంలో డివిజన్‌లోని పోలీసు అధికారులు నాకాబందీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ.. నక్కలదిన్నె తండాలో గతంలో నాటుసారా, కర్నాటక మద్యం విక్రయాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు జోరుగా జరిగేవన్నారు. వీటిపై అన్నమయ్యజిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్, ఎస్ఈబీ అధికారులు జాయింట్‌గా తనిఖీలు నిర్వహించాలని భావించి తొమ్మిదినెలల వ్యవధిలో ఎనిమిది సార్లు విస్తృతంగా సోదాలు జరిపామన్నారు. నాకాబందీ జరిగిన ప్రతిసారీ స్థానికులకు కౌన్సిలింగ్ ఇవ్వడం, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించిన నేపథ్యంలో నక్కలదిన్నె తాండా ప్రజల్లో మార్పు వచ్చిందన్నారు. ఇంటింటినీ జల్లెడ పట్టినా ఎలాంటి కర్నాటక మద్యం, నాటుసారా లభించలేదన్నారు. ఈ మార్పుపై పోలీస్ అధికారిగా సంతృప్తి వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్థానికులు కొందరు పోలీస్ అధికారులకు నక్కలదిన్నెలో నడుస్తున్న వ్యభిచార గృహంపై ఫిర్యాదుచేశారు. దీంతో వన్‌టౌన్ ఎస్ఐ హరిహరప్రసాద్ వ్యభిచార గృహంపై దాడిచేసి ముగ్గురు నిర్వాహకులను, నలుగురు యువతులను, అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకులపై కేసు నమోదుచేయనున్నట్లు మీడియాకు తెలిపారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు హరిహరప్రసాద్, హేమాద్రి, సుధాకర్, చంద్రశేఖర్, రామాంజనేయులు, ఎస్ఈబీ ఎస్ఐ అంజాద్‌బాషా, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

– ఎమ్మెల్యే నవాజ్‌బాషా


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కొత్తవారిపల్లె పంచాయతీలో సర్పంచ్ బోర్‌వెల్‌మహేష్‌తో కలిసి అబ్బిగొంది, చిలకవారిపల్లెలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలుకరించారు. జగనన్న ప్రభుత్వంలో ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజాప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ...గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ఆశీర్వదించి పంపుతున్నారన్నారు. కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాత్రమే అందిందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో పచ్చచొక్కాలకు మాత్రమే పథకాలు అందేవన్నారు. ప్రజాసంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తుంటే.. ప్రతిపక్షాలు తమకు మనుగడ ఉండదని ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రెడ్డిరాణి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ ఆనందపార్థసారథి, వైఎస్సార్ సీపీ నాయకులు వెలుగుచంద్ర, జేసీఎస్ కన్వీనర్ పోతబోలునాగరాజ, మండల కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, వైస్‌చైర్మన్ వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున, క్రిస్టియన్ సెల్ జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులకు నిరసన


పీలేరులో ముస్లిం మైనార్టీల నిరసన ర్యాలీ


కలకడ: పాలస్తీనాకు మద్దతుగా శాంతి ర్యాలీ

పీలేరు రూరల్ : పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడులు చేయడం సరికాదని పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. శుక్రవారం పీలేరు పట్టణంలో ముస్లిం మైనారిటీ జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక జెండామాను నుంచి పంచాయతీ మిట్ట పైగా నాలుగు రోడ్ల కూడలి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలస్తీయునుల పట్ల ఇజ్రాయిల్ అవలంభిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం పాలస్తీనులకు రక్షణ కల్పించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు అల్లావుద్దీన్, అబ్దుల్లా, ఖాదర్‌బాషా, రియాజుల్లా, కదిరి రఫీ, అబీద్, మునీర్, జిలానీ, యాసిన్, మహబూబ్‌బాషా, నిజాం, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనా ప్రజలకు సంఘీభావం

కలకడ : పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా కలకడలో ముస్లిం సోదరులు పాదయాత్ర చేసి ప్రతేక ప్రార్థనలు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం కలకడలోని అన్ని మసీదుల నుంచి ముతవల్లీలు, మత పెద్దలు, ముస్లిం సోదరులు ర్యాలీగా కలకడ మూడురోడ్లు కూడలివద్దకు చేరుకున్నారు. ఇజ్రాయెల్ దాడులను అన్ని దేశాలు ముక్తకంఠంతో ఖండించాలని, దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. వారికి మంచి బుద్ధిని ప్రసాదించాలని, ఇజ్రాయెల్ దాడిలో మృతిచెందిన పాలస్తీనా వారి ఆత్మకు శాంతికలగాలని కోరారు.

కార్గో సేవలు విస్తృతం చేయండి


అవగాహన కల్పిస్తున్న డీఎం బి. కుమార్

పీలేరు రూరల్ : ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సేవలు విస్తృతం చేయాలని డీఎం బి. కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో డ్రైవర్, కండెక్టర్లకు కార్గో డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోర్ డెలివరీకి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 90 ముఖ్య సెంటర్లలో 50 కేజీల వరకు పది కిలోమీటర్లు లోపు డోర్ డెలివరీ చేస్తున్నట్లు తెలిపారు. పార్శిల్‌ను క్షేమంగా, వేగంగా పంపించడం ఆర్టీసీకే సాధ్యమన్నారు. డోర్‌డెలివరీపై బ్యాంకు ఉద్యోగులకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐ సుబ్బమ్మ, గ్యారేజీ ఎంఎఫ్ హరినాథరెడ్డి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పీలేరురూరల్ : విద్యార్థి దశ నుంచి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పీలేరు సెబ్ సీఐ వై. గురుప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక చైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు వినియోగం – అనార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలతో కలిగే నష్టాలు, చట్టపరంగా శిక్షల గురించి తెలియజేశారు. మత్తు పదార్థాలు తయారు చేయడం, విక్రయించడం లాంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మీనరసయ్య, కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జునరెడ్డి, కరస్పాండెంట్ సుధానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పవిత్ర సమర్పణ

వాల్మీకిపురం: టీటీడీ ఆధ్వర్యంలోని వాల్మీకిపురం శ్రీ పట్టాభిరాముడి వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం పవిత్ర సమర్పణ కార్యక్రమం కనుల పండువగా సాగింది. ఉదయం సుప్రభాతసేవ, మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవ, తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పవిత్ర సమర్పణ, పూర్ణాహుతి కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, క్రిష్ణప్రసాద్ భట్టార్, సిబ్బంది క్రిష్ణమూర్తి, నాగరాజ పాల్గొన్నారు.

నవోదయ వైస్ ప్రిన్సిపాల్‌గా వేలాయుధన్

మదనపల్లె సిటీ: స్థానిక చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్‌గా టి.వేలాయుధన్ శుక్రవారం పదవీబాధ్యతలు చేపట్టారు. ఈయన సత్యసాయి జిల్లా లేపాక్షిలో పీజీటీ ఇంగ్లీషు ఉపాధ్యాయుడిగా పని చేస్తూ పదోన్నతిపై వైస్ ప్రిన్సిపల్‌గా పదవీ బాధ్యతలు తీసుకున్నారు. వేలాయుధన్‌ను ప్రిన్సిపల్ గోవిందరావు,విద్యాలయ పూర్వపు విద్యార్థి జనార్ధన్ తదితరులు అభినందించారు.

నేషనల్ హైవే సర్వీస్ రోడ్డు ఎత్తు తగ్గించాలని నిరసన

కలికిరి: కలికిరి నుంచి మదనపల్లి వైపు స్థానిక జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల వద్ద నేషనల్ హైవే సర్వీసు రోడ్డు ఎత్తు తగ్గించాలని రైతులు శుక్రవారం రోడ్డుపై బైటాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అనుగుణంగా ఉండాల్సిన సర్వీసు రోడ్డును సుమారు 18 అడుగుల ఎత్తుకు ఏర్పాటు చేస్తున్నారని, దీనిపై తమ ఇబ్బందులను ఎన్‌హెచ్ అధికారులకు విన్నవించినా పట్టించుకోకుండా రోడ్డు ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీంతో తమ పొలాలకు దారి లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సర్వీసు రోడ్డు రైతులకు అనుగునంగా ఏర్పాటు చేయాలని కోరారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎన్‌హెచ్ అధికారులు ఉన్నతాధికారులు కేటాయించిన డిజైన్ మేరకు నిర్మాణాలు జరుగుతాయని, ఉన్నతాధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు.

ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించాలి

– స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.రాఘవేంద్ర


మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర

మదనపల్లె : ముసాయిదా ఓటరుజాబితా ప్రచురణను అన్ని రాజకీయపార్టీలకు చెందిన ప్రతినిధులు పరిశీలించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో 164–మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఓటరుజాబితా, బూత్‌ల ఏర్పాటు అంశాలపై రాజకీయపార్టీల ప్రతినిధులు, ఏఈఆర్వో, సూపర్‌వైజర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర మాట్లాడుతూ...ఈవీఎంల మొదటిస్థాయి పరిశీలన జరుగుతున్న క్రమంలో శుక్రవారం ఓటరుజాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన ప్రతులను అన్ని రాజకీయపార్టీలకు అందజేస్తామన్నారు. నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు అందుబాటులో ఉంటారన్నారు. ఆ తేదీలలో ఓటరు జాబితాకు సంబంధించి మార్పులు, చేర్పులకు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. డిసెంబర్ 9 వరకు అవకాశం ఉంటుందని, 27 నుంచి 30 వ తేదీవరకు మార్పులు, చేర్పులపై పరిశీలిస్తామన్నారు. 2024 జనవరి 5న తుది ఓటరు జాబితా ప్రచురితం జరుగుతుందన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి పారదర్శకంగా ఓటరుజాబితాను తయారుచేశామన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టరేట్ ఏఓ శేషయ్య, తహసీల్దార్‌లు మహబూబ్‌చాంద్, సీ.ఆర్.మంజుల, దైవరాజన్, జనసేన నాయకులు జంగాలశివరాం, దారంఅనిత, శ్రీరామరామాంజనేయులు, టీడీపీ ఇంతియాజ్‌అహ్మద్, బీజేపీ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలి

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


బాలయ్యగారిపల్లెలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలకడ : ప్రతి సమస్యకు పరిష్కారం చూపడానికే గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బి.రెడ్డివారిపల్లె, బి.కొత్తవడ్డిపల్లె, బాలయ్యగారిపల్లె, బాలయ్యగారిపల్లె హరిజనవాడ, ఎస్టీ కాలనీ, యర్రయ్యగారిపల్లె, రాజీవ్‌నగర్‌కాలనీ, మసీదు వీధి, ఎరుకలకాలని గ్రామాల్లో ఇంటింటిని సందర్శించి సమస్యలపై ఆరాతీశారు. ప్రజలకు ప్రభుత్వం లబ్ధిని తెలియజేశారు. బి.రెడ్డివారిపల్లెలో మురుగునీటి కాలువలు, బి.కొత్తవడ్డిపల్లెలో ఓటరు గుర్తింపు కార్డులు, ఇల్లు మంజూరు కాలేదని తెలియజేశారు. వెంటనే ఓటర్ల జాబితా చూసి నమోదు చేయాలని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. మసీదు వీధిలో కుళాయి నీటికి నగదు చెల్లించి రెండు సంవత్సరాలు పూర్తి అయినా నీరు మాత్రం అందలేదని మహిళలు ఫిర్యాదు చేశారు. నాలుగు గ్రామాల్లో 24 విద్యుత్ స్తంభాలు అవసరమని కోరగా వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన లబ్ధిదారులు ఉంటే పింఛన్ వెంటనే మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, కోన సర్పంచ్ జిల్లా రాజగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రదీప్, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు వెంకట్రమణరెడ్డి, ఆర్‌బికె చైర్మన్ హరినాథరెడ్డి, మండలకో ఆప్షన్ సభ్యులు ఇనాయతుల్లా, షావత్‌అల్లీఖాన్, మోహన్‌రాజ్, ప్రకాష్‌రెడ్డి, కరీముల్లా, సిద్దయ్య, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం చేసిందే ప్రజలకు చెబుదాం


సభలో మాట్లాడుతున్న ఇరగం సుబ్బారెడ్డి

బి.కొత్తకోట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల కోసం ఏం చేసిందో అదే చెబుదామని తంబళ్లపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు ఇరగం సుబ్బారెడ్డి అన్నారు. సామాజిక సాధికార యాత్ర వచ్చేనెల 9న తంబళ్లపల్లె నియోజకవర్గంలో నిర్వహించనున్నారు. దీనిపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పార్టీ ప్రజాప్రతినిధులు, గృహ సారధులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాత్రను విజయవంతం చేసేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ప్రభుత్వం ఇతోధికంగా నిధులు వెచ్చింది అభివృద్ధికి కృషి చేసిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. తంబళ్లపల్లెలో జరిగినంత అభివృద్ధి ఎక్కడా జరగలేదన్నారు. ఈ విషయాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలిపేలా కృషి చేయాలని కోరారు. సామాజిక సాధికార యాత్ర నియోజకవర్గంలో విజయవంతం అయ్యేలా పనిచేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్, మార్కెట్ కమిటీ చైర్మన్ డీఆర్.ఉమాపతి, ఎంపీపీ లక్ష్మనరసమ్మ, మండల కన్వీనర్ ఎన్.ప్రదీప్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ ఖాదర్‌వలీ, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు అనిత, సర్పంచులు భీమగాని నాగిరెడ్డి, గిరిజ, అదెన్న, పుష్పలత, రుక్మిణి, ఎఫ్‌పీఓ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నేరేళ్ల రెడ్డిహరి, అరుణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ లక్ష్మీపతి

నిమ్మనపల్లె : బడి ఈడు పిల్లలను బడిలో చేర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీఓ లక్ష్మీపతి అన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డివారిపల్లె, బండ్లపై గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సచివాలయ అధికారులు బడి ఈడు పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. చదువుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. సచివాలయ అధికారులు, వలంటీర్లతో సమన్వయం చేసుకుని డ్రాపవుట్స్ బడిలో చేరేలా పని చేయాలన్నారు. అనంతరం రెడ్డివారిపల్లెలో బాల్య వివాహాల నివరణపై స్థానికులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా జరుగుతుంటే వెంటనే సమాచారం సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బందికి తెలపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషగిరిరావు, ఎంఈఓ పద్మావతి, పంచాయతీ కార్యదర్శులు మారెప్ప, యర్రమల్లయ్యానాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి టపాసుల దుకాణాలు

పీలేరు : దీపావళి పండుగను పురస్కరించుకుని నిబంధనలకు లోబడి టపాసుల దుకాణాలు ఏర్పాటు చసుకోవాలని తహసీల్దార్ ధనుంజయలు, సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో 14 దుకాణాలు, బోడుమల్లువారిపల్లె వద్ద రెండు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతిచ్చినట్లు తెలిపారు. ప్రతి దుకాణానికి మూడు మీటర్ల దూరం ఉండాలని, దుకాణాలన్నీ ఎల్ ఆకారంలో ఉండాలని సూచించారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత


గుర్రంకొండ : మర్రిపాడులో జగనన్న సురక్ష వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు

మదనపల్లె : ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీ, మున్సిపాలిటీలోని 15వవార్డు సచివాలయాల పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ఎమ్మెల్యే పరిశీలించారు. శిబిరంలో ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై వారిని అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు కంటిఅద్దాలను పంపిణీ చేశారు. ఆయుష్మాన్‌భారత్ కార్డులను అర్హులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శరత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ డిష్‌రమణ, వెలుగుచంద్ర, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండుకరుణాకర్ రెడ్డి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ జి.వెంకటరమణ, రెడ్డిప్రసాద్, భార్గవిరెడ్డి, జిల్లా క్రిస్టియన్‌సెల్ చైర్మన్ జాన్‌బాబు, బావాజాన్, నారాయణస్వామి, కౌన్సిలర్ రాజేష్, పాకాలశంకరమ్మ, రేణుక, ఈశ్వర్‌నాయక్, భాను, ఎస్వీ.రమణ, మేస్త్రీశ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంపీడీఓ భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ధ్యేయం

కలికిరి: పేదల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మైనార్టి కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ నల్లారి తిమ్మారెడ్డి అన్నారు. మండలంలోని అద్దవారిపల్లి గ్రామ సచివాయ పరిధిలో సర్పంచ్ గంగయ్య అధ్యక్షతన శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. క్యాంపులో మొత్తం 313 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, వైద్యాధికారులు చిన్నరెడ్డెప్ప, కావ్యగంధ, హిమబిందు పాల్గొన్నారు.

గ్రామాల్లోనే కార్పొరేట్ వైద్య సేవలు

పెద్దతిప్పసముద్రం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లోనే పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య, అందుతోందని నాయకులు మహమూద్, శివన్న, డ్రిప్ రమణ, సుబ్బరాం, గణపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కమ్మచెరువులో జరిగిన ఈ ఉచిత వైద్య శిబిరానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నూతన మండలాధ్యక్షుడిగా నియమితులైన గణపతిరెడ్డిని నాయకులు ఘనంగా సన్మానించారు.

ఆరోగ్య సురక్ష పేదలకు శ్రీరామ రక్ష

గుర్రంకొండ: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు శ్రీరామరక్ష లాంటి పథకమని జెడ్పీటీసీ సత్రీన్ ముక్తియార్, ఎంపీడీవో వెంకటేశులు అన్నారు. శుక్రవారం మండలంలోని మర్రిపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీ పరిధిలోని 470 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీ, సర్పంచ్ నందినీ, మాజీ ఎంపీటీసీ తుమ్మల రాజశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్, వైద్యాధికారులు రవీంద్ర, చైతన్య, సులోచనలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్‌బీకేలలో ఈ-క్రాప్ ముసాయిదా జాబితా

మదనపల్లె/నిమ్మనపల్లె : రైతుభరోసా కేంద్రాల్లో 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శిస్తున్నట్లు మదనపల్లె, నిమ్మనపల్లె ఏఓలు నాగప్రసాద్, మురళీమోహన్‌లు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. మదనపల్లె మండలంలో ఖరీఫ్2023 పంటకాలంలో 7,147.70 ఎకరాల్లో, నిమ్మనపల్లె మండలంలో 5,151.12 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటల ఈ–క్రాప్ నమోదు చేసినట్లు తెలిపారు. జాబితాలో అభ్యంతరాలు ఉన్నట్లయితే సవరణ కోసం రైతుభరోసా సిబ్బందిని సంప్రదించి రాతపూర్వకంగా తెలపాలన్నారు. 31న తుదిజాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థికి ల్యాప్‌ట్యాప్

మదనపల్లె సిటీ: మదనపల్లె సమీపంలోని అంగళ్లు విశ్వం కాలేజీ విద్యార్థిని భవానికి శుక్రవారం వెలుగు పాఠశాల కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి ల్యాప్‌ట్యాప్ ఉచితంగా అందజేశారు. ఆయన జన్మదినం పురస్కరించుకుని జస్మిత, అయేషా, వెంటకరమణలకు హియరింగ్ పరికరాలను అందించారు. ధాత్రి ఫౌండేషన్‌కు లర్నింగ్ కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, గీత పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాలు ప్రారంభం

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రం కదిరి రోడ్డులో వెలసిన మహబూబే సుబహాని దర్గా ఉరుసు ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దర్గాలో మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శనివారం దీపోత్సవం, ఆదివారం గందోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని దర్గా కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

గంగమ్మ విగ్రహ ప్రతిష్ట

ములకలచెరువు: మండలంలోని కదిరినాథుని కోట చెరువు కట్ట మీద వెలసిన గంగమ్మ గుడిలో అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్టను శుక్రవారం స్థానికులు వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి విగ్రహానికి అభిషేకం నిర్వహించి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పంట నమోదులో తప్పులుంటే సరిచేసుకోండి

కేవీపల్లె : ఈ–పంట నమోదులో ఏవైనా తప్పులుంటే రైతులు సరి చేసుకోవాలని పీలేరు ఏడీఏ వై.వి. రమణరావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపీపల్లె రైతు భరోసా కేంద్రంలో ఈ పంట జాబితాపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాలలో ఈ పంట నమోదు జాబితాలు ప్రదర్శించడం జరుగుతోందన్నారు. ఈ నెల 29వ తేదీ వరకు జాబితా ప్రదర్శన ఉంటుందని రైతులు సరి చూసుకోవాలని కోరారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఆర్‌బీకే సిబ్బందికి తెలియజేయాలని సూచించారు.

అంకాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

పీలేరు : స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వెలసిన శ్రీ రౌద్రాల అంకాలమ్మ అమ్మవారి ఆలయంలో 97 రోజులకు సంబంధించి హుండీ ఆదాయం లెక్కింపు చేపట్టారు. శుక్రవారం ఆలయ కార్యనిర్వహణాధికారి రవీంద్రరాజు, తనిఖీ అధికారి కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో లెక్కింపు చేపట్టారు. ఈసంద్భంగా ఆలయ చైర్మన్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రూ. 1,22,176 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు రాజేశ్వరి, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారుల దాతృత్వం

కలకడ : రోడ్డు ప్రమాదాల నివారణలో టమాట మార్కెట్ వ్యాపారుల దాతృత్వం గొప్పదని సీఐ నాగేంద్ర అన్నారు. శుక్రవారం కలకడ పోలీస్ సర్కిల్ కార్యాలయం ఆవరణంలో టమాటా వ్యాపారులు తయారు చేయించిన 25 రోడ్డు సేఫ్టీ స్టాపర్స్ (వేగనిరోధక గుర్తులను కలిగిన కేడ్లను) పోలీస్ శాఖకు వితరణ చేశారు. అతివేగంగా వాహనాలు నడిపే ప్రదేశంలో, మూడురోడ్ల కూడలి, పాఠశాల ప్రదేశం, వాహనాలు రద్దీ కలిగిన ప్రదేశాలలో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు సీఐ తెలిపారు. కలకడ టమాట మార్కెట్ వ్యాపరులకు సీఐ నాగేంద్ర, ఎస్ఐ తిప్పేస్వామి అభినందించారు.

తప్పుడు ఆరోపణలతో వేధింపులు

బి.కొత్తకోట: తప్పుడు ఆరోపణలతో వేధింపులకు గురిచేసినా పట్టించుకోనని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్ అన్నారు. శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కానుగలకుంట చెరువును ఆక్రమించినట్లు స్థానికేతరులైన టీడీపీ నాయకులు ఫిర్యాదులు చేయడం వారి అవగాహన రాహిత్యాన్ని తెలియజేస్తోందన్నారు. తాను ఒక సెంటు భూమి ఆక్రమించినట్లు నిరూపించినా సర్వే నంబర్ 312లోని భూమిని వదులుకుంటానని అన్నారు. ఆరోపణలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకోకుండా ఫిర్యాదు చేశారన్నారు. రాజకీయంగా వేధించడం కోసమే 2016 నుంచి తనపై ఆరోపణలు చేస్తున్నారని, నిబంధనల ప్రకారమే లేఅవుట్ వేయడం జరిగిందని వివరించారు.